క్లుప్తంగా

మహిళా ఎస్సైకి సన్మానం



ఎస్సై దివ్య దుర్గను సత్కరిస్తున్న టైలర్స్ అసోసియేషన్ సభ్యులు

కొయ్యలగూడెం: పోలీసు శాఖలో ఎస్సైగా ఎంపికైన గుదే దివ్యదుర్గ మండల వాసులకు, టైలర్స్ అసోసియేషన్‌కు గర్వ కారణమని శ్రీగణపతి రామ విలియం హో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజు పేర్కొన్నారు. మంగళవారం కన్నాపురంలో దివ్యదుర్గ ఆమె తల్లిదండ్రులైన ప్రసాద్, రాజేశ్వరిలను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కన్నాపురంలో సాధారణ దర్జీగా ప్రసాద్ జీవనం గడుపుతూ దివ్య దుర్గను ఉన్నతంగా చదివించారని ప్రశంసించారు. మహిళలకు దివ్యదుర్గ ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ఆమె మెమెంటుతో సత్కరించి అభినందించారు. అదే విధంగా కన్నాపురం గ్రామానికి చెందిన మట్టే ప్రసాద్ ఫౌండేషన్ సభ్యులు దివ్య దుర్గను సత్కరించారు. టైలర్స్ అసోసియేషన్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి



వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

లింగపాలెం: రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని వాడి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలని వ్యవసాయ అధికారులు ఏడీఏ బి.నాగకుమార్, ఏవో ఎ.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని యడవెల్లి గ్రామంలో అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవో మురళీకృష్ణ మాట్లాడుతూ దేశానికి వెన్నుముక రైతే నన్నారు. కార్యక్రమంలో పలు శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



తప్పిపోయిన బాలుడిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై పవన్‌కుమార్

పోలవరం రూరల్: తల్లితండ్రులు పిల్లల నడవడిక, అలవాట్లు, ప్రవర్తనపై నిశితంగా పర్యవేక్షించాలని పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ సూచించారు. పోలవరం మండలం పట్టిసం పంచాయతీ పరిధిలోని బంగారంపేటకు చెందిన బాలుడు క్లోపల్లి మేఘసాయి అశ్వత్ మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీంతో తల్లితండ్రులు ఆందోళనకు గురై పోలవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి కొన్ని గంటల వ్యవధిలోనే ఆ బాలుడిని గుర్తించారు. పోలీస్‌స్టేషన్ వద్ద బాలుడిని తల్లితండ్రులకు అప్పగించినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. పోలీసులకు బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



మహాధర్నాను విజయవంతం చేయాలని నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు, ఇఫ్టూ నేతలు

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని మార్చి 10న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఇఫ్టూ అధ్యక్షుడు కేవీ రమణ పిలుపునిచ్చారు. మంగళవారం జంగారెడ్డిగూడెంలో ఇఫ్టూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కొమరం మారమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచిన నేటికీ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడలో మహా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జి.పద్మ, లలిత, తగరం బాబురావు, వెంకటేశ్వరరావు, కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులు గుర్తింపు సంఖ్య పొందాలి

పెదపాడు: రైతులు తప్పని సరిగా గుర్తింపు సంఖ్యను పొందాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు, వీరమ్మకుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

పశుగ్రాసం కొరతను అధిగమించండిలా !

- పెంపకంలో మెలకువలు పాటించాలి
- పశు పోషకులకు వ్యవసాయాధికారుల సూచన



మెట్టలో పశువుల కోసం మామిడి తోటలో రైతులు పండిస్తున్న గడ్డి

చింతలపూడి: రైతులకు వ్యవసాయంతో పాటు పశుపోషణ ఆర్థికంగా తోడ్పాటునిస్తుంది. ఈ నేపథ్యంలో పశు పోషణలో పశుగ్రాసం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. దీంతో మెట్ట ప్రాంతంలో పాడి పశువులను పెంచుకునే రైతులు ముందుకు వస్తున్నారు. పశుగ్రాసం పెంచడంలో మెళకువలు తెలుసుకుంటే మేలు కలుగుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు బి నాగకుమార్ తెలియచేస్తున్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ దశలో గ్రామీణ ప్రాంతాల్లో పాడిని నమ్ముకున్న రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పొచ్చు. పశు పోషణలో 70 శాతం ఖర్చు మేతకే అవుతుందని తెలిసిందే. ఈ దశలో ప్రభుత్వం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలను రైతులకు సరఫరా చేస్తున్నట్లు ఆయన చెప్పారు. వర్షాకాలంలో పశుగ్రాసం పండించుకుంటే వేసవిలో పశువుల పోషణకు ఇబ్బంది ఉండదని చెబుతున్నారు.

జనుము

ఇది కాయజాతి పశుగ్రాసం. అన్ని నేలల్లోనూ అన్ని కాలాల్లో కొద్దిపాటి నీటితో కూడా పండించుకోవచ్చు. ఎకరాకు 12 కిలోల విత్తనాలను 50 కిలోల సూపర్ పాస్ఫేట్‌తో కలిపి చల్లాలి. విత్తిన తరువాత 40, 50 రోజులకు కోతకు వస్తుంది. ఈ మేతను పూత దశలో కోసి ఎండు మేతగా వినియోగించుకుంటే ఉపయోగం ఉంటుంది.

పిల్లి పెసర

వరి సాగు చేసే అన్ని భూముల్లో అంతర పంటగా దీన్ని సాగు చేసుకోవచ్చు. సాధారణ భూములకు పచ్చి రొట్టగా వాడితే భూమికి బలం చేకూరుతుంది. శీతాకాలంలో రబీ పంటగా ఈ పశుగ్రాసాన్ని సాగు చేసుకోవచ్చు. ఈ పశుగ్రాసం వేర్లలో నత్రజని బుడిపెలు ఉండటం వలన భూమి సారవంతమవుతుంది. వరి పంట కోయడానికి 3, 4 రోజుల ముందు అంటే భూమిలో తేమ ఉన్నప్పుడే ఎకరాకు 10–15 కిలోల విత్తనాలను 50 కిలోల సూపర్ పాస్ఫేట్‌తో కలిపి చల్లుకోవాలి. 50 రోజుల్లో కోతకు వచ్చే ఈ పశుగ్రాసం వలన ఎకరాకు 10 నుంచి 12 టన్నుల పచ్చి మేత లభిస్తుంది.

ఇతర రకాలు

ఇక పశుగ్రాస మొక్కజొన్నలో ఆఫ్రికన్ టాల్ రకం జె–1006 రకం, విజయ కాంపోజిట్ రకాలు 85 రోజులకు ఒకేసారి కోతకు వస్తాయి. పండ్ల తోటలు, పామాయిల్ తోటల్లో కూడా సాగు చేసుకోవచ్చు. రైతులకు అధిక పశుగ్రాస దిగుబడులను అందిస్తాయి. పప్పు జాతి రకాలైన అలసంద (బొబ్బర్లు) రష్యన్ జైంట్, బుందేల్ లోబియ 1, 2, ఈసీ–4216, 5287, కేబీసీ–2 మొదలైన రకాలు 55 నుంచి 60 రోజుల్లో ఒకే కోతలో నాణ్యమైన పశుగ్రాసాన్ని అందిస్తాయి.

పంట కోత అనంతరం పశుగ్రాసం పెంచాలి



పంట కోత తరువాత, పండ్ల తోటల్లోని మొక్కల మధ్య ఖాళీ ప్రదేశాల్లో పప్పు జాతి పశుగ్రాసాలు అలసంద, ఉలవ, పిల్లిపెసర, జనుము, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయడం వలన పశుగ్రాసం కొరతను అధిగమించడంతో పాటు భూమిలో నత్రజని స్థిరీకరించబడి భూసారం పెరిగే అవకాశాలు ఉంటాయి.

–బి.నాగకుమార్–వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

మద్ది అంజన్నకు విశేష పూజలు



మద్ది ఆలయంలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో మంగళవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి ప్రభాత సేవ, నిత్యార్చన సేవలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం వరకు పలు సేవల రూపేణా రూ.1,26,237 ఆదాయం వచ్చినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సుమారు 1400 మంది అన్న ప్రసాదం స్వీకరించినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమాలను జువ్వాది కృష్ణ, కురగంటి రంగారావులు పర్యవేక్షించారు.

ఆక్రమణల తొలగింపు



బైపాస్ రోడ్డుపై బడ్డీ కొట్ల విద్యుత్ కనెక్షన్లను తొలగిస్తున్న అధికారులు

చింతలపూడి: రహదారులను ఆక్రమించి ప్రజలకు ఇబ్బంది కలిగేలా చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ డి.పావని హెచ్చరించారు. చింతలపూడి బైపాస్ రోడ్డులో ఉన్న పలు బడ్డీ కొట్లను తొలగించాలని మంగళవారం ఆదేశించారు.అందులో భాగంగా విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ వెంకట్ బడ్డీ కొట్ల విద్యుత్ సర్వీసును తొలగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆక్రమణదారులు స్వతహాగా తీసివేయకపోతే నగర పంచాయతీ తరపున తొలగిస్తామని హెచ్చరించారు. డ్రెయిన్లపై ఎటువంటి నిర్మాణాలు చేయరాదని చెప్పారు. రహదారి పక్కన ఆక్రమణ చేసి తోపుడు బండ్లు పెట్టకూడదన్నారు.

సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు

జంగారెడ్డిగూడెం: సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కోర్స్‌ను ప్రిన్సిపాల్ ప్రారంభించి మాట్లాడుతూ ఎంఎస్ ఆఫీస్‌ను ఉపయోగించి బిజినెస్ డేటా ప్రాసెసింగ్ సర్టిఫికెట్ కోర్సు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సర్టిఫికెట్ కోర్స్ అందరికీ ఉపయోగకరమని, భవిష్యత్తులో జాబ్ బయోడేటా నిమిత్తం, డిగ్రీ తదనంతరం ఉద్యోగాలు సంపాదించడానికి ఈ సర్టిఫికెట్ కోర్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కామర్స్ డిపార్ట్‌మెంట్ అధిపతి డాక్టర్ కె.ఉత్తమ సాగర్, కళాశాల ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ మట్టం మధు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి జె.రాజా శ్రీకాంత్ 45 రోజుల పాటు నిర్వహించే కోర్సును పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



పతాకావిష్కరణ నిర్వహిస్తున్న నేతలు

కొయ్యలగూడెం: భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అగ్రికల్చర్ మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కవులూరి పతిరాజు హాజరయ్యారు. కిసాన్ సంఘ్ మొదట రాజస్థాన్‌లో ఆవిర్భవించిందని నాటి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ రైతుల మన్ననలు పొందుతూ దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు కిసాన్ సంఘ్ సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతే రాజు అనేది మన సిద్ధాంతం అని సూచించారు. ఈ సందర్భంగా కిసాన్ సంఘ్ పతాకావిష్కరణ నిర్వహించి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు సుంకర ప్రసాద్, ఆరేటి ఏసుబాబు, తవ్వ గోపాల్, గంటా లక్ష్మణరావు, మాటూరి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలని నిరసన



శ్మశాన వాటిక వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

బుట్టాయగూడెం: మండల కేంద్రమైన బుట్టాయగూడెం అంబేడ్కర్ నగర్, రాజీవ్ నగర్ కాలనీ వాసులకు చెందిన శ్మశాన వాటికకు సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు బోరు, షెడ్ నిర్మించాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సంఘ నాయకులు మంగళవారం శ్మశాన వాటిక వద్ద నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ అంబేడ్కర్ కాలనీలో ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలు చేయడానికి సరైన రోడ్డు మార్గం లేక అనేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ శ్మశాన వాటికకు ఏర్పాటు చేసిన రహదారికి తుప్పలు పేరుకుపోవడంతో పాటు ఆక్రమణకు గురైందని దీనిపై సర్వే చేసి న్యాయం చేయాలన్నారు. అదే విధంగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించి సీసీ రోడ్డు నిర్మించడంతో పాటు బోరు వేయాలని, షెడ్‌ను కూడా నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బి.డేవిడ్‌రాజు, గొల్లపల్లి వెంకటేశ్వరరావు, కోండ్రు కార్తిక్, గంధం ఇజ్రాయేలు, పేతురు, కొదం ఆనంద్, నిట్టా రవి, గంగాధర్‌రావు, గంజి ఏలియా, తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా నివారణకు అవగాహన ర్యాలీ



కొయ్యలగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది



చింతలపూడి: అవగాహన సదస్సు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కొయ్యలగూడెం: నాటు సారా నివారణకు అవగాహన ర్యాలీ కన్నాపురం గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం నిర్వహించారు. పోలవరం ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటు సారా నిర్మూలన, గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం గురించి ప్రజల్లో అవగాహన కల్పించారు. కన్నాపురంలో నాటుసారా విక్రయిస్తున్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితులతో పాటు ఎనిమిది మందిని బైండోవర్ చేసి తహసీల్దార్ కార్యాలయంలో హాజరు పరిచినట్లు తెలిపారు.

నాటు సారాతో అనర్థాలు

చింతలపూడి: ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చింతలపూడి మండలం, నామవరంలో మంగళవారం నాటు సారా వలన కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నాటు సారా తయారీ, విక్రయించడం, రవాణా చేయడం, డ్రగ్స్, గాంజాయి రవాణా నేరమని అధికారులు తెలిపారు. నాటు సారా తయారీ దారుల గురించి టోల్ ఫ్రీ నెంబర్ 14405కు గాని ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడి సెల్ నంబర్ 9440902428 గాని సమాచారం అందించాలని సీఐ పి.అశోక్ విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆందోళనకారులతో డీవైఈవో చర్చలు



గ్రామస్తులతో చర్చిస్తున్న డీవైఈఓ

కొయ్యలగూడెం: ఎంపీయూపీ స్కూల్‌ను హైస్కూల్‌గా మార్చాలని ఆందోళన చేస్తున్న దిప్పకాయలపాడు గ్రామస్తులతో డీవైఈవో రామన్న దొర మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి చర్చించారు. ఎంపీయూపీ స్కూల్‌ను హైస్కూల్ గా మార్చడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించడంతోపాటు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని అప్పటి వరకు తరగతులను నిర్వహించాల్సిందిగా కోరారు. అదేవిధంగా ప్రస్తుతం ఎంపీయుపీ స్కూల్‌లోని ప్రైమరీ తరగతులను గొల్లగూడెంలోని ఉన్న ఎంపీపీ స్కూల్‌లో విలీనం చేయడానికి గల అంశాలను పరిశీలించారు. కాగా ప్రస్తుత పాఠశాలలోని ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు కన్నాపురం హైస్కూల్‌లో విలీనానికి ఎట్టి పరిస్థితులలోనూ ఒప్పుకోమని గ్రామస్తులు ముక్తకంఠంతో డీవైఈఓకి సూచించారు. సర్పంచ్ సున్నం శాంతకుమారి, కాకర్ల నంది, దుగ్గిరాల బాబి, కాకర్ల శేషు, అక్తర్ సాహెబ్, గద్దె బాబు తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మేన్ బాలకృష్ణ సేవలు అభినందనీయం

భీమడోలు: భీమడోలు విద్యుత్ శాఖ లైన్‌మన్ పంచకర్ల బాలకృష్ణ సేవలు అభినందనీయమని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు అన్నారు. జాతీయ లైన్‌మెన్ దివస్‌లో భాగంగా మంగళవారం భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో ఉత్తమ సేవలకు గుర్తింపుగా భీమడోలు లైన్‌మెన్ బాలకృష్ణకు ఉత్తమ లైన్‌మెన్ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఏలూరులో జరిగిన అభినందన కార్యక్రమంలో భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో అంకితభావంతో విధులను నిర్వహిస్తూ విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలకు గుర్తింపుగా బాలకృష్ణకు పురస్కారాన్ని అందజేస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేసి మరిన్ని అవార్డులను అందుకోవాలని అభినందించారు. ఈఈలు కేఎం అంబేడ్కర్, పీఏ ఖాన్, పి.రాధాకృష్ణ, కె.గోపాలకృష్ణ, ఏఈ వి.శివాజీ పాల్గొన్నారు.

యథేచ్ఛగా అడవుల నరికివేత



కొండిన్యముక్తి టేకు ప్లాంటేషన్‌లో నరికి వేసిన టేకు చెట్టు (ఫైల్)



జామాయిల్ మాటున తరలిస్తున్న అటవీ ప్రాంతంలో నరికి వేసిన మారుజాతి కలప

కుక్కునూరు: అడవే కదా, మనలను అడ్డుకునేదెవరు, అడిగేదెవరు అన్నట్లుగా అక్రమార్కులు మండలంలోని అడవులను యథేచ్ఛగా నరికేస్తున్నారు. జామాయిల్ కర్రమాటున కొందరు అడవిలోని మారుజాతి కలపను తరలించుకుని పోతుండగా, పొగాకు బ్యారన్లకు మరి కొందరు తరలిస్తున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా దొరికితేనే దొంగ అన్నట్లుగా అటవీశాఖాధికారుల తీరు ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అమరవరం అటవీరేంజ్ పరిధిలోని అటవీప్రాంతంలో చెట్లను కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా నరికివేతకు పాల్పడుతున్నారు. రిజర్వు ఫారెస్ట్‌లోని అటవీశాఖ ఆధ్వర్యంలో వేసిన జామాయిల్‌ను కూడా నరికి వేసి పేపర్ మిల్లులకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది. ఇంత జరుగుతున్నా అటవీశాఖాధికారులు కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో మండలంలో ఏర్పాటు చేసిన నర్సరీలకు ఎటువంటి అనుమతులు లేకుండా బేంబో కర్రలను తరలిస్తుండగా, స్థానికులు ఇచ్చిన సమాచారంతో అటవీశాఖాధికారులు కేసులు నమోదు చేశారు. కాగా స్థానికులు సమాచారం ఇస్తే తప్ప అటవీశాఖాధికారులు అక్రమంగా తరలిపోతున్న అటవీ సంపదను పట్టుకోకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బర్లమడుగు ప్రాంతంలో ఇటీవల ఓ వ్యక్తి జామాయిల్ కర్రమాటున అటవీ ప్రాంతంలోని మారుజాతి కలపను నరికి, తోలు ఒలిచి తరలించినట్లు సమాచారం. గతంలో కొండన్యముక్తి గ్రామం సమీపంలో టేకు ప్లాంటేషన్‌లోని చెట్లను కూడా కొందరు అక్రమంగా నరికి తరలించుకుపోయినట్లు తెలుస్తుంది. కాగా అమరవరం అటరేంజ్ పరిధిలో పలు సంఘటనలు చోటు చేసుకుంటున్న అటవీశాఖ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించకపోవడం సిబ్బంది ప్రమేయం ఏమైనా ఉందా అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని అడవిని సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.

చిరు ధాన్యాలతోనే ఆరోగ్యం



అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

జంగారెడ్డిగూడెం: చిరుధాన్యాలు తరచుగా తీసుకోవడం ద్వారా శరీరానికి కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అంది, ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పి.బ్యూల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా నాలుగో రోజు సుబ్బంపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు లీలారాణి, రత్నకుమారి, కృష్ణకుమారి, గర్భిణులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం

బుట్టాయగూడెం: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నాణ్యమైన పౌష్టికాహారం అందించడం సాధ్యమని సూపర్‌వైజర్ కె.ఝాన్సీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తూర్పురేగులకుంట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కేంద్రానికి వచ్చే తల్లులకు యోగా, న్యూట్రిషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మీఎస్ కృపామణి, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలి

ద్వారకాతిరుమల: స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరీ మాట్లాడుతూ కొర్రలు, అరికలు, రాగులు, సజ్జలు, జొన్నలు, అండు కొర్రలు వంటి చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. అనంతరం ద్వారకాతిరుమల జీఎంఎస్‌కే లక్ష్మీ సుజన మహిళలతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి

కుక్కునూరు: మహిళలు పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని కుక్కునూరు ఇన్‌చార్జి సీడీపీఓ ఎన్.లక్ష్మీ కుమారి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో భాగంగా కుక్కునూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దళిత యువకుల ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన యువకులు

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపివేశారంటూ కొందరు దళిత యువకులు మంగళవారం రాత్రి ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దాంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయం వద్ద దళిత యువకులు అంబేడ్కర్ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అలాగే ఆ ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు దిమ్మను నిర్మిస్తున్నారు. అయితే ఫ్లెక్సీని చింపివేశారంటూ యువకులు ఆందోళనకు దిగారు. గ్రామ సర్పంచ్ లక్కాబత్తుల సిద్ధిరాజుతో పాటు, మరి కొందరు రోడ్డుపై బైఠాయించారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు దిమ్మను నిర్మిస్తుంటే కొందరు అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై టి.సుధీర్ ఆందోళనకారులను బుజ్జగించారు. అనుమతులు పొందిన తరువాత విగ్రహ ఏర్పాటుకు దిమ్మను నిర్మించుకోవాలని సూచించారు. ఫ్లెక్సీని ఎప్పటిలాగే పెట్టుకోమని తెలిపారు. దాంతో ఆందోళన సద్దుమణిగింది.